

పులిచింతల సమాచారం

అచ్చంపేట: సాగర్, కృష్ణా పరీవాహక ప్రాంతాల నుంచి పులిచింతలకు 2,47,951 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 3,10,700 క్యూసెక్కులు వదులుతున్నారు.



ఘనంగా గంగమ్మ తల్లి వేడుకలు

వెల్దుర్తి: గుండ్లపాడులోని గంగమ్మతల్లి దేవాలయ 19వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. భక్తులు మొక్కుబడులు చెల్లించి, నైవేద్యాలు సమర్పించారు.

ఎనిమిదో రోజుకు చేరిన దీక్ష



తెనాలి రూరల్: తెనాలి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటుకు అప్పజెప్పడాన్ని నిరసిస్తూ టెలికాం ఉద్యోగిని కె.పద్మావతి చేపట్టిన నిరసన సోమవారం ఎనిమిదో రోజుకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంగళగిరిలో సీఎం చంద్రబాబు పర్యటన



మంగళగిరి టౌన్: మంగళగిరిలో మంగళవారం, బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం అధికారులతో కలసి పరిశీలించారు. నగర పరిధిలోని సీకే కన్వెన్షన్‌లో జీరో ప్రావర్టీ పి–4 కార్యక్రమం ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీటింగ్, సభాస్థలి, వీడియో గ్యాలరీ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నగర పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ ఫ్లైఓవర్ వద్ద ఉన్న మయూరి టెక్ పార్క్‌లో బుధవారం జరగనున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొననున్న దృష్ట్యా, అక్కడి ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సమన్వయంతో విధులు నిర్వహించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల కో–ఆర్డినేటర్, శాసనమండలి సభ్యులు పెందుర్తి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ప్లానింగ్ శాఖ జాయింట్ సెక్రటరీ శంకరరావు, సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, సీఎంఓ కార్యాలయ అధికారి ఇక్బాల్ సాహెబ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా పాల్గొన్నారు.

విరిగిన ఇనుప గడ్డర్‌తో ఇబ్బందులు



తెనాలి రూరల్: తెనాలి–చందోలు మార్గంలోని వైకుంఠపురం రైల్వే వంతెన వద్ద తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో వంతెన దెబ్బతినకుండా ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో విరిగి కింద పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం మరమ్మతులు చేయించారు. తరచూ గడ్డర్ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గాంధీ ఆశ్రమానికి రూ.లక్ష విరాళం



తెనాలి అర్బన్: పెదరావూరుకు చెందిన షేక్ హానీఫ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బాషా మహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమ నిర్వాహణకు రూ.లక్ష చెక్కును నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి అందజేశారు. బుర్రిపాలెం రోడ్డులోని ఆశ్రమంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో షేక్ జానీ సైదా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

15 మండలాల్లో మోస్తరు వర్షం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లాలోని 15 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా కాకుమాను మండలంలో 37.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు పశ్చిమలో 0.6 మి.మీ. పడింది. సగటున 8.3 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. పెదనందిపాడు మండలంలో 32.6 మి.మీ., పొన్నూరు 24, ప్రత్తిపాడు 19.8, వట్టిచెరుకూరు 7.4, చేబ్రోలు 5.8, ఫిరంగిపురం 4.4, తాడేపల్లి 3.6, కొల్లిపర 3.4, తుళ్లూరు 2.8, మేడికొండూరు 2.4, మంగళగిరి 2, తాడికొండ 1.8, గుంటూరు తూర్పులో 0.8 మి.మీ. చొప్పున వర్షం పడింది. ఆగస్టు 18వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 95.6 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 209.6 మి.మీ.నమోదైంది.

కృష్ణవేణి.. ఉగ్రరూపిణి

- ఆందోళన చెందుతున్న జిల్లా రైతాంగం
- ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న పంటలు
- మరోసారి వర్షం ప్రారంభంతో రైతుల్లో గుబులు
- పెరుగుతున్న కృష్ణమ్మ వరద ఉధృతి
- ఏడు లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉందని అంచనా
- అప్రమత్తం అయిన గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులు
- పునరావాస కేంద్రాలకు తీర ప్రాంత వాసుల తరలింపు



సీతానగరం పుష్కర ఘాట్లలో కంచె ఏర్పాటు చేయిస్తున్న ఎస్‌ఐ ఖాజావలి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఒకవైపు కృష్ణమ్మ వరద దోబూచులాటలు.. మరోవైపు ముసురుతో రైతులకు కంటి మీద కునుకు కరువైంది. వరుణుడి ప్రకోపంతో అల్లాడుతున్నారు. వర్షాలు తగ్గడంతో పంట ముంపు నుంచి బయటపడతామనే ఆశతో ఉన్న రైతులకు నిరాశే ఎదురైంది. మళ్లీ వర్షాలు కురుస్తుండటం, వాతావరణ శాఖ అధికారులు కూడా భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలతో ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో పాటు ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లాలోని 15 మండలాల్లో ఆదివారం రాత్రి నుంచి ఒక మోస్తరు వర్షం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా కాకుమాను మండలంలో 37.2 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా గుంటూరు పశ్చిమలో 0.6 మి.మీ. పడింది. సగటున 8.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

బ్యారేజీకి వరద నీరు తాకిడి

మరోవైపు ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి క్రమేపీ పెరుగుతోంది. రెండు రోజుల కిందట రెండో ప్రమాద హెచ్చరిక వరకూ వెళ్లి, మళ్లీ వరద ప్రవాహం తగ్గుతూ వచ్చిన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ నిదానంగా నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది. సోమవారం బ్యారేజీకి వచ్చిన 2.84 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం నాటికి 3.97 లక్షల క్యూసెక్కుల నీరు వద్దకు వచ్చే అవకాశముందని, ఆ తర్వాత రోజుకు సుమారు ఏడు లక్షల నీటి ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతంలో వర్షాలు కొనసాగితే మరింత ఉధృతి పెరిగే అవకాశం కనపడుతోంది.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి సోమవారం 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. 2,51,182 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 3,31,699 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. రెంటచింతల మండలం సత్రశాల వద్ద నున్న నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి 16 క్రస్ట్‌గేట్లు ద్వారా 2,92,192 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు.

నిండుకుండలా పులి చింతల

మరోవైపు పులిచింతల ప్రాజెక్టుకు సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 2,47,951 క్యూసెక్కులు వచ్చి చేరింది. దిగువకు 10 క్రష్ట్ గేట్ల ద్వారా 3,10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తెలంగాణతోపాటు, ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు కారణంగా కృష్ణా నదికి వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం పులిచింతల నుంచి 2,51,743 క్యూసెక్కులు, పాలేరు నుంచి 25,716 క్యూసెక్కులు, వజినేపల్లి నుంచి 1,76,542 క్యూసెక్కులు, కట్లేరు నుంచి 10 క్యూసెక్కులు, కొండవీటి వాగు నుంచి 2,100 క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీకి వస్తుందని సమాచారం. తెలంగాణాలో పడుతున్న భారీ వర్షాలకు మూసీతో పాటు ఇతర వాగుల నుంచి నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

పుష్కర ఘాట్ల వద్ద కంచె ఏర్పాటు

తాడేపల్లి రూరల్: కృష్ణా నదికి వరద నీరు భారీగా వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతంలోని పుష్కర ఘాట్లలో భద్రత దృష్ట్యా సోమవారం తాడేపల్లి పోలీసులు ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఖాజావలి మాట్లాడుతూ కృష్ణా నది ఎగువ ప్రాంతం నుంచి భారీగా వస్తున్న వరద నీటిని ఇరిగేషన్ అధికారులు దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నారన్నారు. పుష్కర ఘాట్ల వద్ద సందర్శకులు మెట్ల మీద నుంచి నీళ్లలోకి దిగుతున్నారని తెలిపారు. ప్రమాదాలను నివారించేందుకు పుష్కర ఘాట్లన్నింటిలో కంచెను ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. తీరంలో ప్రజలు నదిలోకి దిగకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

అంబేడ్కర్ రాజ్యాంగానికి అవమానం



గుంటూరు లాడ్జి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న చైతన్య, విద్యార్థులు

- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య
- రెడ్‌బుక్ రాజ్యాంగంతో కూటమి అరాచక పాలన
- కూటమి ప్రభుత్వ విధానాలపై విద్యార్థుల నిరసన
- ప్రభుత్వ జీవోలు తగులబెట్టి ఆందోళన

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్) : అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానించే రీతిలో కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏకంగా అంబేడ్కర్ రాజ్యాంగం తమకు అక్కర్లేదని, సొంతంగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని తయారు చేసుకుని రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పార్టీ విద్యార్థి విభాగం గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం పాదాల చెంత విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విధానాలపై దుమ్మెత్తి పోశారు. జీవో కాపీలను తగులబెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

రాజ్యాంగం అవహేళన

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైతన్య మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగంతో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుపేద విద్యార్థులు చదువుకునే హాస్టళ్లు, గురుకుల విద్యాలయాలు, విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసేంత నీచానికి దిగజారారని ధ్వజమెత్తారు. కనీసం మౌలిక వసతులు కూడా లేక సంక్షేమ హాస్టళ్లన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన గురుతర బాధ్యత విద్యార్థి సంఘాలపైనే ఉందని పేర్కొన్నారు. విద్యా శాఖా మంత్రి లోకేష్ నిజాయతీపరుడైతే ముందుగా విద్యా సంస్థలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. అది మానేసి విద్యార్థి సంఘాల ప్రవేశంపై నిషేధం వంటి దుర్మార్గపూరితమైన చర్యలకు దిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంపతి నాగరాజు, గుంటూరు నగర అధ్యక్షుడు గుడిశెట్టి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేష్, కరీం, కిరణ్, రామకృష్ణ, మస్తాన్, జిల్లా కార్యదర్శులు అరుణ్, సన్ని, వినయ్, సతీష్ యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేటేటి నవీన్, గుంటూరు తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు సాజిద్, తెనాలి నియోజకవర్గం అధ్యక్షుడు శామ్యూల్, ప్రత్తిపాడు నియోజకవర్గం అధ్యక్షుడు కెనడీ, మంగళగిరి నియోజకవర్గం అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

తాడికొండ: అమరావతిలోని వేంకటపాలెంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆగస్టు 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. లోక కల్యాణార్థం మొదటిసారిగా ఆలయంలో పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం అర్చకులు విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, ఆచార్య ఋత్విక్ వరణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. 19వ తేదీ ఉదయం పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ఠ అధివాసం, సర్వదైవత్య హోమం చేపడుతారు. 20న ఉదయం పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, ప్రధాన హోమాలు, స్నపన తిరుమంజనం, పవిత్రాభిమంత్రణ, పవిత్ర సమర్పణం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, మహా శాంతి హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. 21వ తేదీ ఉదయం పుణ్యాహవచనం, యాగశాల వైదిక కార్యక్రమాలు, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, ఆచార్య, ఆగమ సలహాదారు, ఋత్విక్కులకు బహుమానం, యాజమాన ఆశీర్వాచనం చేపట్టనున్నారు. కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ ఎం.మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఏ. రామకృష్ణ, ఎం.సందీప్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

‘పండుటాకు’పై ప్రతాపం

- వారసుల భౌతిక దాడి
- ఇంటిని కబ్జా చేసి వెళ్లగొట్టారు
- సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీ ఇచ్చిన 84 ఏళ్ల వృద్ధురాలు



చిలుకూరి వెంకటమ్మ

తెనాలి: వృద్ధులను ఆదరంగా చూసుకోవాల్సిన వారసులు బాధ్యతలను మరిచిపోతున్నారు. మనుషుల కన్నా ఆస్తులపైనే మమకారం పెంచుకుంటున్నారు. పండుటాకులపై ప్రతాపం చూపిస్తున్నారు. ఇంట్లోంచి వెళ్లగొట్టేందుకూ వెనుకాడటం లేదు. పట్టణంలోని శాంతీనగర్‌కు చెందిన చిలుకూరి వెంకటమ్మ (84)ఇందుకో నిదర్శనం. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయానికి సోమవారం వచ్చిన ఆమె తన కష్టాలను పరిపాలన అధికారి శ్రీధర్‌బాబుకు ఏకరువు పెట్టారు. లిఖితపూర్వక వినతిపత్రాన్ని అందజేశారు. ఆ ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషను పరిధిలోని శాంతినగర్‌లో వెంకటమ్మకు పక్కా ఇల్లు ఉంది. భర్త ఎప్పుడో చనిపోయారు. ఆమె కుమారుడు చిలుకూరి రామయ్య, మంగమ్మకు ముగ్గురు సంతానం. అనారోగ్యంతో భార్యాభర్తలు కాలం చేశారు. మనవరాళ్లు ఇద్దరు, ఒక మనవడు ఉన్నారు. ముగ్గురిలో లలిత అనే మనవరాలు నర్స్‌గా మారి ఇటలీలో ఉంటోంది. మనవడు చిలుకూరి రాజేష్‌బాబు ఎనిమిదేళ్ల క్రితం చిలకలూరిపేటకు చెందిన శాంతకుమారిని వివాహం చేసుకున్నాడు. ఎమ్మెస్సీ చేసిన శాంతకుమారి, గతంలో చిలకలూరిపేట, హైదరాబాద్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం తెనాలిలోనే ఓ కార్పొరేట్ పాఠశాలలో పని చేస్తున్నారు. వెంకటమ్మకు గల ఇంకో మనవరాలు అమల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. పూర్తిగా మంచానికే పరిమితమైన ఆమె సంరక్షణ బాధ్యతను తల్లిదండ్రులు లేని కారణంగా నాయనమ్మ అయిన వెంకటమ్మ చూస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల చిలకలూరిపేట నుంచి వచ్చిన తల్లి శారదతో కలసి శాంతకుమారి దౌర్జన్యంగా తన ఇంట్లోకి చొరబడినట్టు వెంకటమ్మ ఆరోపించింది. అంతేకాకుండా తనను కొట్టి, తనను, మనవరాలిని బయటకు వెళ్లగొట్టినట్టు ఆరోపించారు. సొంత ఇంటిని కబ్జా చేసి, వృద్ధురాలినైన తనను గెంటేయడంతో దిక్కుతోచని స్థితిలో ఆశ్రయించినట్టు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు మొరపెట్టుకున్నారు. తనకు తగిన న్యాయం చేసి, ఇల్లు ఇప్పించాలని వేడుకున్నారు.

వేర్వేరు గంజాయి కేసుల్లో 15 మంది అరెస్టు

- 3300 గ్రాములు స్వాధీనం
- నిందితుడు ఒకరు పరారీ



నిందితులతో డీఎస్పీ జనార్దనరావు, పక్కన సీఐలు రమేష్‌బాబు, ఉమేష్, ఎస్‌ఐలు

తెనాలి రూరల్: రెండు వేర్వేరు కేసుల్లో 15 మందిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి, 3300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ బి. జనార్దనరావు వివరాలు వెల్లడించారు. స్థానిక సుందరయ్యనగర్‌లో యువకులు గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందుకున్న త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు సిబ్బందితో దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారయ్యారు. వారి నుంచి 1700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో మృత్యుంజయ కుమార్ సింగ్, కరికట్ల మధు, దాది షణ్ముఖ అలియాస్ బన్ను, పఠాన్ మహమ్మద్ అలియాస్ ఫర్దీన్ ఖాన్, ఆకుల మారన్న అలియాస్ మారి, బుంగ అలియాస్ సయ్యద్ సైదా, ఆరిమళ్ల విజయ్ కుమార్ అలియాస్ జగ్గం నాని, సంతోష్ కుమార్ ఉన్నారు. వీరిలో మృత్యుంజయ కుమార్ సింగ్ బిహార్ వాసి. ఆ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి తెనాలి ప్రాంతంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

■ కొల్లిపర మండల కేంద్రం డంపింగ్ యార్డ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న రూరల్ సీఐ ఆర్. ఉమేష్, ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి దాడులు చేసి, ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 1600 గ్రాముల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో గంజాయి విక్రేతలు కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన పంది నాగ యుగంధర్ బాబు, షేక్ రకీబ్, పెదకాకాని మండలం ఉప్పలపాడుకి చెందిన రామిశెట్టి శ్యామ్‌వెంకట్ అలియాస్ బాబి, దుగునూరి మోహన్ తేజ, కొల్లిపర మండలం తూములూరుకు చెందిన కనపర్తి సుందరరావు, గంజాయి తాగుతున్న షేక్ అబ్దుల్ కరీం, విష్ణుమొలకల భరత్ కుమార్ ఉన్నారు. నిందితుల్లోని నాగ యుగంధర్ బాబు, షేక్ రకీబ్‌లు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి, 15 గ్రాములు ప్యాకెట్లుగా తయారు చేసి తెనాలి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. వీరిలో పలు కేసుల్లో నిందితుడైన కనపర్తి సుందరరావు అపహరించిన మరో మూడు బైకులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. పలుమార్లు గంజాయి కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురిపై పీడీ యాక్ట్ ప్రయోగించనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. చాకచక్యంగా రెండు ఘటనల్లో నిందితులను అదుపులోకి తీసుకున్న సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, రూరల్ సీఐ ఆర్. ఉమేష్, కొల్లిపర ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరగబడ్డ తెలుగు తమ్ముళ్లు

- బండారుపల్లి సొసైటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకున్న టీడీపీ నేతలు
- సీనియర్లను సంప్రదించకుండా షాడో ఎమ్మెల్యే రూ.20 లక్షలకు పదవి అమ్ముకున్నాడని ఆరోపణ
- ఎమ్మెల్యే కార్యాలయంతో చర్చలు ఫలించక పోవడంతో ప్రమాణ స్వీకారం వాయిదా



బండారుపల్లి సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

తాడికొండ: మండలంలోని బండారుపల్లి కో–ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారాన్ని తెలుగు తమ్ముళ్లు అడ్డుకున్నారు. దశాబ్దాలుగా పార్టీని మోస్తున్న తమకు తెలియకుండా ఇటీవల పార్టీలో చేరిన గుంటుపల్లి పానయ్యకు పదవిని షాడో ఎమ్మెల్యే రూ.20 లక్షలకు అమ్ముకున్నాడని పలువురు ఆరోపించారు. సొసైటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం అడ్డుకుంటామంటూ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. పార్టీ గ్రామ అధ్యక్ష పదవిని కూడా రూ.8 లక్షలకు బేరం పెట్టి, తమకు తెలియకుండా వేరొకరికి కట్టబెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పదవులు అమ్మకం

పార్టీలో తమకు ప్రాధాన్యత లేకుండా, కష్టపడిన వారికి పదవులు ఇవ్వకుండా ఇష్టారీతిగా అమ్ముకుంటే పార్టీని నమ్ముకున్న వారి పరిస్థితి ఏంటని మాజీ సర్పంచ్ శేషగిరిరావు, సొసైటీ మాజీ ఛైర్మన్ దండమూడి సాంబశివరావు తదితరులు మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని, ఎంపీ పెమ్మసాని సోదరుడు రవి సమక్షంలో ఎమ్మెల్యే కార్యాలయంలో జరుగుతున్న వైఖరిపై తెలియజేశామని పేర్కొన్నారు. ఆయన ఎమ్మెల్యేతో మాట్లాడితే తాను వచ్చి నచ్చచెబుతానని దాటవేశాడని ఆరోపించారు.తాత్కాలికంగా ప్రమాణ స్వీకారం వాయిదా వేయమని చెప్పినా ముందుకెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై కేసులు పెట్టి జైలుకు పంపించిన కుటుంబానికి పార్టీ పదవులు అమ్ముకోవడం సిగ్గుచేటుగా ఉందని, పార్టీని నమ్ముకున్న తమకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు.

ఫలించని చర్చలు

ఎమ్మెల్యే కార్యాలయం నుంచి రాజీ నిమిత్తం వచ్చిన జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు సముదాయించేందుకు యత్నించినా ససేమిరా అనడంతో ప్రమాణ స్వీకారం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి ఎమ్మెల్యే సమక్షంలో చర్చలు జరిపిన అనంతరం తమ నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. నిరసనలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మానుకొండ శివరామకృష్ణ, నేతలు దండమూడి వెంకట్రావు, నిమ్మగడ్డ జానకీ రామయ్య, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సొసైటీ ఎదుట ఏర్పాటు చేసిన పోలీసు పికెటింగ్

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,541
అమ్మకాలు	42,285
నిల్వ	7,029

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,200
341	10,000-14,600
సూపర్ -10	10,000-13,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-14,200
నంబరు-5	10,000-13,500
341	11,000-14,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,500
బాడిగ 5531	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,300
ఆర్మూర్	9,800 - 11,200
తాలుకాయలు	6,000 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్-1	10,000-13,200
బాడిగ - 5531	10,000-12,100
ఆర్మూరు	10,200 - 13500
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

జీవాల దొంగతనాలపై పోలీసుల నిర్లిప్తత

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుల ఫిర్యాదు

నగరంపాలెం: జీవాలను దొంగలించే ముఠాలోని వారిని అప్పగించినా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితులు వాపోయారు. సోమవారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితులు ఫిర్యాదు చేశారు. జిల్లా ఏఎస్పీలు జి.వి.రమణమూర్తి (పరి పాలన), ఎ.హనుమంతు (ఏఆర్) బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్లల్లో మాట్లాడారు. బాధితుల అర్జీలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమాచారాన్ని నిర్ణీత గడువులోగా డీపీఓకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. డీఎస్పీలు శివాజీరాజు (సీసీఎస్), శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్) అర్జీలు స్వీకరించారు.



ఫిర్యాది సమస్య ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ రమణకుమార్

వాహనాలకు అద్దె అడిగితే బెదిరింపులు

రెండేళ్ల కిందట ఓ ఐదుగురు వ్యక్తులు పరిచయమయ్యారు. జీఎంసీలో అద్దె ప్రాతిపదికన నా రెండేసి కార్లు, ట్రాక్టర్లను వారు తీసుకెళ్లారు. అద్దె వస్తుందనే వారికి వాహనాలు ఇచ్చాను. ఏడాదికి పైగా ఉపయోగించుకున్నారు. ఆ తర్వాత కార్లు, ట్రాక్టర్ల అద్దె అడిగితే సరైన సమాధానం లేదు. ఆఖరికి తాను అప్పగించిన కార్లు, ట్రాక్టర్లను తిరిగి ఇవ్వాలని అడిగిన వారి నుంచి స్పందన లేదు. అదేమని అడిగితే నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. న్యాయం చేయాలి.

– శ్రీనివాసరావు, తిమ్మాపురం, ప్రత్తిపాడు

కాన్వాయ్ నగదు చెల్లించడం లేదు

రెండున్నరేళ్ల కిందట ఓ కాన్వాయ్ నిమిత్తం 23 కార్లను కలెక్టరేట్‌లోని ఒకరికి అప్పగించాను. అయితే, కార్లకు సంబంధించి బకాయిలు ఇప్పటి వరకు చెల్లించలేదు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని ఆ విభాగానికి పలుమార్లు వెళ్లినా పట్టించుకోవడం లేదు. ఒక్కొక్క కారుకి రూ.15 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. ఎన్నిమార్లు అడిగినా ఫలితం లేదు. ఇతర డ్రైవర్లకు పైకం చెల్లించాల్సి ఉందని, ప్రాధేయపడుతున్నా వారు కనికరించడం లేదు. నాకు న్యాయం చేయాలి.

– హనుమంత్, కారు డ్రైవర్, మణిపురం బ్రిడ్జి

పశువుల దొంగతనాలతో నష్టపోతున్నాం



మేమంతా కోడె దూడల వ్యాపారం చేస్తుంటాం. ఇళ్ల వద్దనున్న కొట్టాల్లో కట్టేసిన ఆవులు, గేదెలు, కోడె దూడలను దొంగలిస్తున్నారు. ఈనెల 10న దొంగతనానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో వారిని పట్టుకునే ప్రయత్నంలో నలుగురు పారిపోగా, ఒకరూ పట్టుబడ్డారు. అతడిని స్థానిక పోలీసులకు అప్పగించాం. పారిపోయిన ఆ నలుగురి పేర్లను పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. అయినప్పటికీ వారిపై ఎటువంటి చర్యల్లేవు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి, అర్ధరాత్రుళ్లు కట్టేసిన జీవాల తాళ్లను తెంచుకెళ్లి తరలిస్తున్నారు. దాదాపు ఎనిమిదేళ్లుగా ఇదే వృత్తిగా జీవిస్తున్నారు. నాలుగేసి చొప్పున హైదరాబాద్‌కు తరలించి, అక్కడ అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మూడు నెలల్లో 16 జీవాలను దొంగలించారు. రెండు నెలలో మరో పదహారు గేదెలను ఎత్తుకెళ్లారు. ముఠాపై పలుమార్లు ఫిర్యాదులు వస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు.

– దొడ్డి సుధీర్ (సంపత్‌నగర్) అబ్దుల్, ఇర్ఫాన్ (ఆనందపేట ఏడో వీధి)

డాక్టర్ సుమితా శంకర్ ఆవిష్కరణకు పేటెంట్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్ ఆవిష్కరించిన 'నెగటివ్ ప్రెషర్ ఆధారిత లింబ్ డీకాంజెషన్ స్లీవ్'కు పేటెంట్ లభించింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం నుంచి ఆమె అభివృద్ధి చేసిన వైద్య పరికరం (డిజైన్ నం. 459230-001)కు సర్టిఫికెట్ లభించింది. ఈ వినూత్న పరికరం చేతులు, కాళ్ల వాపు, వెనస్ కాంజెషన్, సంక్లిష్ట గాయాల చికిత్సలో కొత్త మార్గాన్ని అందిస్తుంది. నియంత్రిత నెగటివ్ ప్రెషర్ ద్వారా వాపును తగ్గించడం, రక్తప్రసరణ మెరుగుపరచడం, గాయాల మాన్పును వేగవంతం చేయడం దీని ప్రధాన లక్ష్యం. ఈ పరికరాన్ని డాక్టర్ కృతి నందూరి సహ ఆవిష్కర్తగా వ్యవహరించారు. డాక్టర్ సుమితా శంకర్ తక్కువ ఖర్చుతో, రోగులకు అనుకూలమైన, గ్రామీణ, పట్టణ ఆరోగ్య సేవలకు అందుబాటులో ఉండే విధంగా పరికరాన్ని రూపకల్పన చేశారు. తన ఆవిష్కరణకు పేటెంట్ లభించిన సందర్భంగా డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ ఈ గుర్తింపు కేవలం డిజైన్ రక్షణ మాత్రమే కాదని, గాయాల సంరక్షణలో కొత్త ఆశలు తెరవడమేనని పేర్కొన్నారు. డిజైన్ యాక్ట్ - 2000 ప్రకారం పది సంవత్సరాల పాటు ఈ డిజైన్ పేటెంట్ ఉంటుందని, దీన్ని గరిష్ఠంగా 15 సంవత్సరాల వరకు పొడిగించవచ్చని తెలిపారు. దీని ద్వారా ఆవిష్కర్తలు పరికరాన్ని మరింత అభివృద్ధి చేసి, మార్కెట్ చేసుకునేందుకు ప్రత్యేక హక్కులను పొందుతారని పేర్కొన్నారు. ఇకపై తమ బృందం క్లినికల్ ధ్రువీకరణ, అకడమిక్ ప్రచురణలు, సహకారాలు ద్వారా దీన్ని మరింత విస్తరించడానికి యోచిస్తోందని డాక్టర్ సుమితా శంకర్ వెల్లడించారు.

స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు వెన్నుపోటు

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మేరీ



నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పరిపాలన ఆడపడుచులకు వెన్నుపోటు పొడిచే విధంగా ఉందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, పల్నాడు జిల్లా మహిళా విభాగం ఇన్‌చార్జి బుల్లా మేరీ ఆరోపించారు. నగరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళల్ని కూటమి ప్రభుత్వం మభ్యపెడుతోందని చెప్పారు. ఏ బస్సులోనైనా రాష్ట్రమంతా తిరగవచ్చని ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. కానీ నేడు మాత్రం కొన్ని బస్సులకే పరిమితం చేసి మహిళలని మరోసారి మోసం చేశారని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని నమ్ముకుని బయటకు వచ్చే మహిళలకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని తెలిపారు. అనేక బస్సుల్లో ఫ్రీ టికెట్ ఇవ్వకుండా బస్సులోంచి నిర్దాక్షిణ్యంగా మహిళల్ని దించేస్తున్నారని ఆరోపించారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో బాలుర అరెస్టు

రేపల్లె: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకున్నట్లు రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వివరాలను వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన పట్టణంలోని రింగు రోడ్డు సెంటర్‌లో బొర్రా కృష్ణ ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి దుకాణానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రేపల్లె-పెనుమూడి రోడ్డులో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొల్లూరుకు చెందిన ముగ్గురు బాలురు పట్టుబడ్డారు. వారిని విచారించగా ద్విచక్ర వాహనాన్ని దొంగిలించడంతో పాటు పలు నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.9.6 లక్షల విలువైన 10 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ వీరికి గతంలో నేర ప్రవృత్తి లేదని, డబ్బుల కోసం నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

సీజీహెచ్ఎస్‌లో ఆధునిక సౌకర్యాలు

చీఫ్ మెడికల్ ఆఫీసర్ కోటేశ్వరరావు

గుంటూరు మెడికల్: మారుతున్న కాలానుగుణంగా అత్యాధునిక వైద్య సదుపాయాలతో సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్(సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సీహెచ్.కోటేశ్వరరావు పేర్కొన్నారు. నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ కార్యాలయంలో సోమవారం నూతనంగా ఏర్పాటైన లేబొరేటరీ, ఇంజెక్షన్, బీపీ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి సీజీహెచ్ఎస్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి.హేమాసుందరి అధ్యక్షత వహించారు. డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా, సీజీహెచ్ఎస్ ఆరోగ్య కేంద్రాలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరింత మెరుగైన స్థితికి తీసుకొస్తామని వెల్లడించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.విద్య మాట్లాడుతూ నూతన ప్రారంభోత్సవాల ద్వారా మరిన్ని వైద్య సౌకర్యాలకు అంకురార్పణ జరిగిందని తెలిపారు. రోగుల ఆరోగ్య సంక్షేమమే తమ లక్ష్యమని చెప్పారు. సీజీహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ ఆస్పత్రిలో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ఉద్యోగులు, పెన్షనర్లలో ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి.హేమా సుందరి, ఫార్మాసిస్టు ఆయేషా బేగం, సునీల్, లేబొరేటరీ అసిస్టెంట్లు మురళి, రామారావు, సిబ్బంది మోహన్, మక్బూల్, వెంకటేశ్వర్లు, రత్నరాజు, నందమణి పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు

అర్జీల పరిష్కారంలో సమన్వయం అవసరం

డీఆర్వో ఖాజావలి

గుంటూరు వెస్ట్ : అర్జీల పరిష్కారంలో వివిధ శాఖల సమన్వయం చాలా ముఖ్యమని జిల్లా రెవెన్యూ అధికారి షేఖ్ ఖాజావలి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాఖల మధ్య సమన్వయం లేకపోతే అర్జీల పరిష్కారం ఆలస్యమవుతుందని తెలిపారు. ప్రతి శాఖలో ఎన్ని అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయో అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. అర్జీల పరిష్కారంలో సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించి ఆన్సర్లు నిర్ణీత గడువులోనే దాఖలు చేయాలని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను స్థానిక మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు కూడా ప్రతి వారం ఇవ్వొచ్చని సూచించారు. దీంతో స్థానికంగా ఉండే ప్రజల సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు. అనంతరం వచ్చిన 198 అర్జీలను డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో, అధికారులు

అక్రమాలను ప్రోత్సహిస్తున్న జనసేన నేతలు



నేను గతంలో కొలకలూరులోని 14 వార్డు మెంబర్‌గా జనసేన తరఫున గెలిచాను. మా గ్రామంలో కొందరు ప్రభుత్వ స్థలంలో సిమెంట్ బెంచీలు వేసి, దానిపై మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు గురి చేస్తున్నారు. అక్కడ జనసేన నాయకులే అక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. దీంతో నేను పదవికి రాజీనామా చేశా. పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి సమస్య వివరించినా ఉపయోగం లేదు. న్యాయం చేయాలని మనవి.

–తిరుమలశెట్టి హేమలత, కొలకలూరు.

గిరిజన ఆస్తులు అన్యాక్రాంతం



గిరిజన సంఘాల పేరుతో కొందరు ప్రభుత్వ భూముల్లో సొంత భవనాలు నిర్మించుకుంటూ వ్యాపారాలు చేస్తున్నారు. పేదల బాగు కోసం ఉపయోగించాల్సిన భూముల్లో వ్యాపారం చేస్తూ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా నిబంధనలు ఉల్లంఘిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. విచారించి న్యాయం చేయండి.

–గుంటూరు జిల్లా గిరిజన భవన్ సంక్షేమ కమిటీ

ఉచిత ఉపకరణాలు వినియోగించుకోండి

జిల్లా సహిత విద్య సమన్వయకర్త సెల్వరాజ్

పెదకూరపాడు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ప్రభుత్వం అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా సహిత విద్య సమన్వయకర్త సెల్వరాజ్ అన్నారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. సెల్వరాజ్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో 520 మంది విద్యార్థులు భవిత పాఠశాలలో ఉన్నారని తెలిపారు. వారిలో ఉపకరణాల అవసరమైన వారికి నిర్ధారణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆడియాలజిస్ట్, సైకాలజిస్ట్, ఆర్థోపెడిక్ సంబంధించిన ప్రత్యేక ప్రతిభావంతులను ఢిల్లీ నుంచి వచ్చిన వైద్య బందం ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకారణాలను అందించేలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తారన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన వైద్య బృందం డాక్టర్ నితీష్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాదరావు, సత్యనారాయణ, హెచ్ఎం కేవీ రమణ, స్కూల్ అసిస్టెంట్లు సుబ్బారావు, సుశితాప్రియ, లక్ష్మీనారాయణ, నూర్జహాన్, అచ్చయ్య, నసీమా బీగ్, బాబు, ఐఈఆర్పీ టీచర్లు లక్ష్మీ, కమల, స్వాతి, రమాదేవి, రహీం పాల్గొన్నారు.



ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డాక్టర్ నితిన్

బార్ల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 159 బార్లు

- 26 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మూడు సంవత్సరాల కాల పరిమితి మేరకు కేటాయింపు
- ప్రతి దరఖాస్తుకు రూ.5.10 లక్షలు చెల్లించాలి
- 28న జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా షాపుల కేటాయింపు
- సమావేశంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ కె. శ్రీనివాసులు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, ఈఎస్ అరుణ కుమారి, సీఐ లత

నెహ్రూనగర్: గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 159 బార్ల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గుంటూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 110 బార్లకు, పల్నాడు జిల్లాలో 49 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. మూడు విధానాల (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్) ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మూడు సంవత్సరాల కాల పరిమితితో కొత్త బార్ పాలసీ మేరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. ఒక వ్యక్తి ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఏ షాపుకైనా కనీసం నాలుగు దరఖాస్తులు వస్తానే లాటరీ తీస్తామని చెప్పారు. షాపు దక్కించుకున్న వారు ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31 వరకు మూడేళ్ల కాల పరిమితితో బార్లను నిర్వహించుకోవచ్చని వివరించారు. 50వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 55 లక్షలు, 5 లక్షలకు పైబడి జనాభా ఉంటే రూ.75 లక్షలు లైసెన్స్ ఉంటుందని, దీన్ని ఏడాదిలోగా ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చని చెప్పారు. ప్రతి దరఖాస్తుకు రూ .5.10 లక్షలు చెల్లించాలన్నారు. అందులో రూ. 5 లక్షలు దరఖాస్తు ఫీజు, రూ. పదివేలు ప్రాసెసింగ్ ఫీజు కింద తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తుదారుడికి వయసు కనీసం 21 సంవత్సరాలు నిండి ఉండాలని వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 28వ తేదిన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందని ఆయన వెల్లడించారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారిణి అరుణ కుమారి, సీఐ లత తదితరులు పాల్గొన్నారు.

లాటరీ ద్వారా గీత కులాలకు షాపుల కేటాయింపు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్త బార్ పాలసీలో గీత కులాలకు(గౌడ, గౌడ్) పది శాతం రిజర్వేషన్స్ కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో గీత కులాల సబ్ క్యాస్ట్ వారీగా సోమవారం ఆయా వర్గాల వారికి షాపుల కేటాయిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ లాటరీ తీశారు.

- గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గౌడకు- 4, గౌడ్‌కు- 2, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గౌడకు- 2, గౌడ్- 0, తెనాలిలో గౌడకు- 1, గౌడ్‌కు- 1 చొప్పున మొత్తం పది షాపులు కేటాయించారు.
- నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో గౌడకు- 0, గౌడ్‌కు- 1, చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో గౌడకు- 1, గౌడ్‌కు- 0, సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలో గౌడకు- 0, గౌడ్‌కు- 1, దాచేపల్లి నగర పంచాయితీ పరిధిలో గౌడకు- 1, గౌడ్‌కు- 0, మాచర్ల మున్సిపాలిటీ పరిధిలో గౌడకు- 1, గౌడ్- 0 చొప్పున మొత్తం 5 షాపులను లాటరీ ద్వారా కేటాయించారు.
- గీత కులాల వారి నుంచి ఈ నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరించి, 30న షాపుల కేటాయింపు జరుగుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఏ ప్రాంతంలో అయితే ఆయా కులాల వారికి షాపులు కేటాయించబడ్డాయో వారే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.



షాపుల కేటాయింపు జరుపుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి

ఫొటోగ్రఫీ పోటీల విజేతలు

తెనాలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ సహకారంతో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల విజేతలను సోమవారం తెనాలిలో ప్రకటించారు. డాక్టర్ ఎస్.భగవాన్‌దాస్, బండి రాజన్‌బాబు స్మారకార్థం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఈ పోటీలను నిర్వహించారు. కలర్ విభాగంలో బి.జోగారావు తీసిన 'విద్యార్థినిపై పోలీసు జులుం' ఫొటో ప్రథమ బహుమతికి ఎంపికకాగా, 'తాజ్‌మహల్ అందం'పై జీజీవీఎస్‌వీ ప్రసాద్ తీసిన ఫొటోకు ద్వితీయ బహుమతి, పిట్టల మహేష్ తీసిన 'ప్రభల తీర్థం' ఫొటో తృతీయ బహుమతికి ఎంపికయ్యాయి. మోనోక్రోమ్ విభాగంలో వనం శరత్‌బాబు ఫొటో 'నీరు విలువైనది' ప్రథమ బహుమతికి ఎంపికకాగా, మహేష్.జి తీసిన 'బ్లడీ ఫైట్'కు ద్వితీయ బహుమతి, వనమామలై శ్రీనివాసాచారి ఫొటో 'కమ్యూనిటీ బావి'కి తృతీయ బహుమతికి ఎంపిక చేశారు. రెండు కేటగిరీల్లోనూ అయిదేసి ఫొటోల చొప్పున పది ఫొటోలు మెరిట్ సర్టిఫికెట్‌కు ఎంపికయ్యాయి. సబ్జెక్ట్, కంపోజిషన్, టెక్నికల్స్, లైటింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ప్రకటించినట్టు ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ కానాల సుధాకరరెడ్డి తెలియజేశారు. త్వరలో జరగనున్న ప్రత్యేక సభలో విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.



కలర్ విభాగంలో ప్రథమ బహుమతి 'విద్యార్థినిపై పోలీసు జులుం'



'మోనోక్రోమ్'లో ప్రథమ బహుమతి 'నీరు విలువైనది'

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

బెదిరింపులకు దిగిన టీడీపీ కౌన్సిలర్

తెనాలి అర్బన్: స్థానిక బోసు రోడ్డులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ భవన నిర్మాణాన్ని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. దీంతో సదరు భవన యాజమాని, టీడీపీ కౌన్సిలర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. బోసు రోడ్డు టౌన్ చర్చి పక్క రోడ్డులో ఓ వ్యక్తి సెల్లార్ జీ+2 ఫ్లోర్‌కు అనుమతులు తీసుకున్నారు.ఈ మేరకు భవనాన్ని నిర్మించారు. అదనపు అంతస్తు నిర్మాణం కోసం పిల్లర్లను ఏర్పాటు చేస్తుండటంతో మున్సిపల్ అధికారులకు సమాచారం వచ్చింది. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు సిబ్బందితో అక్కడకు వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నించారు.

ఇంతలో అక్కడకు వచ్చిన టీడీపీ కౌన్సిలర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అంతు చూస్తానంటూ బెదిరించినట్లు సమాచారం. వాదోపవాదల అనంతరం నిర్మాణాన్ని ఆపినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.